కథ

# సెల్యూట్

''జయ జయ జయ
ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి...''

విషాదం నిండె గదుల్లో సుడులు తిరుగుతుంటే... ఆవేదన ఎదలో తుల్లి స్పృశిస్తోంది. అతడి గొంతు తడబడుతోంది. పల్లవి పెదవి దాటడం లేదు.

అనునిత్యం మనసు పొరల్లో ప్రతిధ్వనిస్తూ వేదఘోషలా అలలు అలలుగా సాగిపోయే ఆ గీతాన్ని ఎప్పట్లా శ్రావ్యంగా ఆలపించలేకపోతోంది స్వరపేటిక.

శోక పర్వతం బద్దలైనట్టు కనుపాపల శిఖరాల్లోంచి అశ్రుకణాలు జలజల రాల్తున్నాయి!

అతనొక సైనికుడు!

మాతృభూమి కోసం మాతృదేవత ఒడిని వదలి యుద్ధరంగానికి తరలి వచ్చిన నవ యువ జవాన్!

వణుకుతున్న పెదాల మధ్యన... పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని.. బిగపట్టాడా యువకుడు.

అతడి చేతిలో రెపరెపలాడ్తోన్న ఉత్తరం జారి కిందపడింది.

ఆలోచనలు సుడిగాలిలా చుట్టుముట్ట సాగాయతన్ని.

★ ★ ★

''బాబూ! నా ఆరోగ్యం క్షీణిస్తోంది. వ్యాధి తిరగబెడుతోందయ్యా'' వేదనగా అంది అతని కన్నతల్లి.

''భరతమాత పరిస్థితి అలాగే వుందమ్మా. శత్రుమూకలు నలుదిశలా పొంచి ఉన్నాయి'' అన్నాడతను.

''లేక లేక కలిగిన ఒక్కగానొక్క నలుసువి. ఈ సమయంలో నన్నొదిలిపెట్టి పోకయ్యా.''

అభ్యర్థించడం లేదు, శోకదేవతలా విలపిస్తోందా తల్లి హృదయం.

''అమ్మా! నేను సైనికుడిని. కన్నీటికో, కన్నవాళ్ళకో కట్టుబడకూడదు. దేశ శ్రేయస్సుని కాంక్షించడం నా కర్తవ్యం.''

స్థిరత్వం అతడి గొంతులో వేళ్ళూనుకుంటోంది.

''తల్లిమాట వినరా'' ఈసారి తండ్రి కంఠం సన్నగా వణికింది.

ఆజ్ఞాపించలేదు. దీనంగా వేడుకున్నాడా తండ్రి. భార్యని ఆ స్థితిలో చూస్తుంటే ఆయన కళ్ళు మూగగా వర్షిస్తున్నాయి.

''నేనా రోజు... 'ఆర్మీ ట్రయినింగ్‌కి వెళతాను నాన్నా' అనడిగితే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'ఈ కాలం కుర్రాళ్ళు ఐ.ఏ.యస్, ఐ.పీ.యస్, ఇంజనీరో, డాక్టరో కావాలని కలలు కంటుంటే నీకీ ఆలోచన రావడం రియల్లీ గ్రేట్. ఐ యామ్ ప్రౌడాఫ్ యూ మై బాయ్!' అంటూ ఆనందంగా నా వెన్నుతట్టిన మీరు... మీరేనా ఈరోజిలా?'' అతడి భృకుటి ముడివడింది.

''నిజమేరా! అందుకేగా నీకు చంద్రబోస్ అని పేరు పెట్టుకున్నాను. కానీ బాబూ... నేనూ ఒక తండ్రినేరా! రక్త సంబంధం నన్ను కట్టిపడేస్తోంది. నా కోసం కాకపోయినా తల్లికోసం, నిన్ను కన్నతల్లి కోసమైనా విరమించుకో'' ప్రాధేయపడ్డాడా తండ్రి.

''నాన్నా! అన్నీ తెలిసిన వారు. పైగా చదువుకున్న వారు. మీరూ అలాగే అంటే ఎలా? అర్జంట్‌గా రమ్మని టెలిగ్రామ్ వచ్చింది. వెళ్ళకపోతే ఎలా?'' తండ్రికి నచ్చ చెప్పబోయాడు బోస్.

తల్లి కలుగజేసుకుంది.

''మరి నేను చదువురాని దాన్నయ్యా! దేశభక్తి, దేశసేవ... ఇవేవీ తెలీని వెర్రిదాన్ని. నాకు తెల్సిందల్లా కన్న పేగు మీద మమకారం, నీవు నా కళ్ళ ముందే కదలాడాలన్న స్వార్థం, కడుపుతీపయ్యా, వెళ్ళకయ్యా.''

ఆ తల్లి కనుకొనల్లో తడి, గొంతులో ఆర్ద్రత.

చంద్రబోస్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ద్వారా సైనికుడిగా రెండేళ్ళ క్రితం సెలెక్టయ్యాడు.

సెలవుపెట్టి, ఉద్యోగంలో చేరాక మొదటిసారి తల్లిదండ్రులని చూడ్డానికి వచ్చాడు. బోస్ వచ్చేసరికి అతని తల్లి అనారోగ్యంతో బాధపడుతూ వుంది.

రెండేళ్ళుగా బోస్ దూరమవడం, మరో పక్క ఆమె ఆరోగ్యం క్షీణించడం, కొడుకు మీద మరింత బెంగపడేలా చేశాయి.

ఇంతలో శత్రుసైన్యం దాడికి దిగబోతోందని తక్షణం వెనక్కి వచ్చేయమంటూ టెలిగ్రామ్ వచ్చిందతనికి.

కొడుకు మౌనంగా వుండిపోయేసరికి ''పుత్ర వాత్సల్యం కదరా! తల్లిదండ్రులుగా మేం తల్లడిల్లడం సహజమేగా!'' అన్నాడు తండ్రి.

కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయాక, నెమ్మదిగా పెదవి విప్పాడు బోస్.

''నాన్నా! తప్పదు. నేను వెళ్ళాల్సిందే. బతుకు తెరువు కోసం దుబాయో, సౌదీనో వెళ్ళానని అనుకోండి. మన జగిత్యాల నుండి ఎంతమంది అలా పోవడం లేదు. అందులో నన్నొకడిగా భావించండి'' తన నిర్ణయాన్ని తేల్చి చెప్పాడు.

తాను వెళ్ళేది యుద్ధరంగానికి అన్న విషయం మాత్రం తల్లిదండ్రుల దగ్గర దాచి పెట్టాడు. తెలిస్తే వాళ్ళు మానసికంగా మరింత కృంగిపోతారని, కుమిలిపోతారని తెలుసతనికి.

అందుకే-

''ఒక సైనికుడు భవబంధాల్ని త్యాగం చేసి తన అణువణువునీ దేశం కోసం అర్పించగలగాలి. ఆ విద్యుక్తధర్మం కోసం వెళ్తున్నాను. నన్నాపకండి'' దృఢంగా చెప్పాడు. చేసేదేం లేక కొడుక్కి కన్నీటితో వీడ్కోలు చెప్పారా వృద్ధదంపతులు.

★ ★ ★

అది గుర్తొచ్చి కుప్పకూలిపోయాడు బోస్.

పక్కన పడి వున్న ఉత్తరాన్ని చేతిలోకి తీసుకొని ఆర్తిగా తడిమాడు.

కొద్దిక్షణాలు నిర్లిప్తంగా, విషాదంగా దొర్లిపోయాయి.

ఉబికి వస్తున్న కన్నీటిని... కనురెప్పల్ని మూసి అదిమిపడ్తూనే... భారంగా కళ్ళు తెరిచాడు.

ఉత్తరాన్ని విప్పాడు మరోసారి.

కన్నీటి పొరల్లా అలుక్కుపోయిన ఆ అక్షరాల్ని..మసకబారిన చూపుల్తో..మరోసారి చదివాడు.

''నిన్నే కలవరిస్తూ-
అమ్మ..మీ అమ్మ కన్ను మూసిందయ్యా!''-

అంటూ తండ్రి పంపిన కబురు అతడ్ని శోక సంద్రంలో ముంచేసింది.

కన్నీరు మున్నీరుగా విలపించాడు.

ఓ తడి జ్ఞాపకం అతడి స్మృతి పథంలో మెదిలి గుండెని మెలిపెట్టేసింది.

''ఒరే అయ్యా! నే సచ్చిపోతే కనీసం నా శవం చూడ్డానికైనా వస్తవా?'' జాలిగా అడుగుతూనే ''రావాలయ్యా... నా తల కొరివి నువ్వే పెట్టాలి. అలా అని మాటివ్వు'' అంటూ కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యింది బోస్ తల్లి.

బిడ్డ కడచూపుకి వస్తాడన్న నమ్మకం లేకో, తాను చివరి క్షణాల్ని లెక్క పెడుతున్నానన్న బాధతోనో, తనని విడిచిపోతానంటున్న కొడుకుతో చేతిలో చెయ్యి వేయించుకుందా తల్లి.

తల్లి మాటలకి తల్లడిల్లిందా తనయుడి

హృదయం.

భారంగా ఒక్క నిట్టూర్పు వదిలాడు.

''అమ్మా! నీకేమీ కాదు. మళ్ళీ నేను నిన్ను చూడ్డానికి తొందర్లోనే వచ్చేస్తాను. అంత వరకూ నవ్వుతూ వుండాలి'' ధైర్యం చెబుతూ తల్లిని ఓదార్చాడు.



కరిగిపోయిన ఆ ఆలోచనల నుండి తేరుకుని నిర్వేదంగా శూన్యంలోకి చూస్తుండిపోయాడు బోస్.

ఆ యువకుడి వ్యధను చూస్తూ పక్కనే వున్న కమాండర్ తట్టుకోలేకపోయాడు. బోస్‌ని ఆ స్థితిలో చూస్తున్న కమాండర్ కళ్ళల్లో కూడా ఓ తడిపొర తళుక్కుమంది.

బోస్‌కి ఇరవై ఏళ్ళుంటాయి.

దేశం కోసం అతను పడే తపన అప్పుడప్పుడూ ఆ కమాండర్‌ని విస్మయానికి గురి చేస్తుంటుంది. అందుకే ఆ యువకుడంటే ప్రత్యేకమైన అభిమానం. ఆ చనువుతోనే తన తండ్రి రాసే ఉత్తరాల్ని కమాండర్‌కి చూపిస్తుంటాడు బోస్.

ఓదార్పు బోస్ క్షోభని తగ్గించలేకపోయినా మనోధైర్యాన్నైనా కల్గిస్తుందని అతడికి దగ్గరగా వచ్చి కాస్త వంగి అనునయంగా భుజం తట్టాడు

ఎనుగంటి వేణుగోపాల్

కమాండర్.

ఆ స్పర్శకి స్పందిస్తూ... మోచేత్తో కన్నీళ్ళు తుడిచేసుకుని.... గౌరవ సూచనగా లేచి నిలబడ్డాడా యువజవాన్.

''మీ ఊరెళతావా?'' ప్రేమగా అడిగాడు కమాండర్.

తలెత్తాడు బోస్.

అతడి కనుకొనల్లో విస్మయపు విస్ఫోటనం.

పెదవి విప్పలేదు, మౌనం వహించాడు.

''నేనే ఏర్పాట్లు చేస్తాను.''

బోస్ సమాధానం కోసం చూసాడు.

బోస్ కళ్ళల్లో సంశయం.

''అక్కడ నీ తల్లి శవమై వుంది.''

కమాండర్ గొంతులో తీవ్రత.

అడ్డంగా తలూపాడు బోస్.

''వెళ్ళను. ఇక్కడ నా భరతమాత కన్నీరు కారుస్తోంది.''

అతడి గుండె ధైర్యం కమాండర్‌ని విభ్రాంతికి లోనుచేసింది. బోస్ నుండి ఆ జవాబు వస్తుందని ఊహించలేదతను.

''నీ చేతుల్తో తలకొరివి పెడితే నిన్ను కన్న ఆ

తల్లి ఆత్మకి తృప్తి. కనీసం కడుపుకైనా వచ్చినందుకు నీ తండ్రి సంతోషిస్తాడు'' నవ్వు చెప్పాడు.

''నా తల్లికి తలకొరివి పెట్టడానికి నేను కాకపోతే మరొకరు. ఆ పల్లెలో వేలమంది వున్నారు. కానీ ఈ నేల తల్లిని శత్రువుల నుంచి కాపాడుకోవడానికి అహరహం అప్రమత్తంగా ఉండాల్సింది వీర జవానేనని. వ్యక్తికంటే కుటుంబం, కుటుంబం కంటే దేశం గొప్పదన్న సత్యాన్ని మీరేగా సార్ నూరిపోశారు. ఆ కర్తవ్యం కోసం నేను నేలకొరుగుతాను తప్ప నా స్వార్థం కోసం వెనకడుగు వేయను.''

బోస్ కంఠంలోని స్థిరత్వం మాటల్లోని వీరత్వం అబ్బురపరిచిందాయన్ని.

బోస్ గురించి బాగా తెలుసు భరత మాత ముద్దుబిడ్డ అతడు. నర నరాన దేశభక్తి జీర్ణించుకుపోయింది అతనిలో.

''ఒక ఉత్తముణ్ణి కన్నందుకు ఓ తల్లీ! మరణించినా కూడా నీ జన్మధన్యమైంది. ఈ వీరపోరుడు నీ బిడ్డ అయినందుకు తల్లీ, భారతీ! గర్వించు..'' అంటూ బోస్ తల్లిని, జన్మభూమిని కొనియాడాడు కమాండర్.

తనకంటే హోదాలో, వయసులో చిన్నవాడైనా, బోస్‌లోని మహోన్నత ఆశయానికి అతడి కర్తవ్య పరాయణత్వానికి, మనసారా అభినందిస్తూ, మనసులోనే సెల్యూట్ చేశాడు కమాండర్.

★ ★ ★

ప్రస్తుతం-

ఇండియా బార్డర్‌లో యుద్ధం జరుగుతోంది!

భారత భూభాగంలోకి దొంగచాటున చొచ్చుకువస్తున్న శత్రుసేనల్ని చెదరని మనోధైర్యంతో భారతీయ వీర జవాన్లు తరిమి తరిమి కొడుతున్న తరుణమది.

★ ★ ★

భారత సైనికుల వ్యూహానికి చెల్లాచెదురయ్యాయి శత్రుమూకలు. దాడికి తట్టుకోలేక ఎక్కడి వాళ్ళక్కడే నేలకొరగసాగారు.

కాసేపట్లోనే పరిస్థితి భారత జవాన్ల అదుపులోకి వచ్చింది. శత్రువుల దాడులు తగ్గుముఖం పట్టడంతో ఒకింతసేపు పోరాటం నిలిచిపోయింది.

అలుపెరుగని భారతీయ సైనిక పటాలాలు విజయోత్సాహంతో వెనుదిరిగాయి. దళాలవారీగా తమ తమ గుడారాల వైపు చేరుకోసాగారు.

చంద్రబోస్ సైనికదళం కదిలిపోతోంది.

అప్పుడు విన్పించిందో ధ్వని-

సన్నగా... భూగర్భంలో నుండి తెరలు తెరలుగా వచ్చినట్లు 'దాహం..దాహం' అని!

చెవులు రిక్కించాడు బోస్. వెను వెంటనే రియాక్టయ్యాడు.

కమాండర్‌కి సౌంజ్ఞ చేసి ఏదో చెప్పాడు. వాళ్ళక్కడే ఆగిపోయారు.

ఒక్కుదుటున ఆ శబ్దం వినపడ్డ దిశవైపు ఉరికాడు బోస్.

అక్కడ కన్పించిన దృశ్యం నిర్ఘాంత పరిచిందతన్ని, ఊహించని విధంగా!

ఒక శత్రుసైనికుడు కొన ఊపిరితో నిస్త్రాణంగా పడివున్నాడు. ప్రాణార్థమై, దీనావస్థలో దాహం తీర్చమంటున్నాడు.

బోస్ టక్కున ఆగిపోయాడు. అడుగులు ముందుకు పడలేదు.

క్షణకాలం సందిగ్ధత!

మూతపడుతున్న కనురెప్పల్ని బలవంతంగా తెరుస్తూ మూస్తూ హృదయ విదారకంగా అడుగుతున్నాడతను..'దాహం..దాహం' అని.

శత్రువు కంట పడగానే భుజానికి వేలాడుతున్న తుపాకీపై బిగుసుకున్న బోస్ అరచేతి వేళ్ళు, అతడి దైన్య స్థితికి స్పందిస్తూ..చప్పున విడివడ్డాయి.

శత్రువే కావచ్చు. నిస్సహాయుడు. రక్తసిక్తమై పడి వున్నాడు.

బోస్ మస్తిష్కంలో తీవ్ర సంఘర్షణ తెరమరుగై ...అతడి హృదయసాగరంలో కరుణారస తరంగాలు ఆవిష్కృతమయ్యాయి.

తలెత్తి పరిసరాల వైపు దృష్టి సారించాడు. దగ్గర్లో సెలయేటి గలగలలు. మానవత్వానికి నిలువెత్తు సాక్ష్యంలా చప్పున కదిలాడా దిక్కుకి.

ఓ ఆకుని దొన్నెగా చేసుకొని పరుగు పరుగున వెళ్ళి తీసుకు వచ్చిన మంచి నీటిని అతని నోటికందించాడు.

దాహం తీరిన ఆ వ్యక్తిలో శ్వాస ఎగపోత తగ్గింది. కొద్దిగా ఊరట. ఉపశమనం కలుగుతుంటే బ్రతుకుపై చిన్న ఆశ. కండరాల్లో కదలిక మొదలయ్యింది. శక్తిని కూడదీసుకుంటూ నెమ్మదిగా లేవబోయాడు.




సాయం చేశాడు బోస్.

తూలుతూనే లేచి కూచున్నాడతను. అతడి కళ్ళల్లో కృతజ్ఞతా భావం.

''ఏ దేశ పౌరుడైనా ఆలపించాల్సింది తమ జాతీయ గీతాలూ, దేశభక్తి గేయాలే కాదని మానవత్వ గానం కూడానంటూ విశ్వశాంతి చరణాన్ని సరికొత్త రీతిలో పల్లవిస్తూ... శత్రువుకి సైతం ఆపదవేళలో సాయపడిన వీరుడా! నీకు కాదు..నీలోని మహోన్నత మానవత్వ విలువలకిదే నా సైనిక వందనం..''

అనుకుంటూ అతికష్టం మీద రెండు చేతులెత్తి మొక్కే ప్రయత్నం చేయబోయాడు.

అది గ్రహించిన బోస్ వారిస్తూ అభయసూచనగా అతని చేతుల్ని తన చేతుల్తో స్పృశించి వదిలేస్తూ లేచాడు.

అప్పుడు జరిగిందొక అనూహ్య ఘటన.

అక్కడ నుండి నిష్క్రమించడానికి వెనుదిరిగిన బోస్... ట్రిగ్గర్ నొక్కబడిన శబ్దం చెవిన పడడంతో గిర్రున తల తిప్పాడు.

స్ప్లిట్ సెకండ్‌లో దారుణం జరిగిపోయింది.

అప్పటికే అతడి వెన్నులోకి తూటాలు దిగబడ్డాయి.

ఇటు తిరిగిన బోస్ కనుపాపలు వేన వేల ప్రశ్నల్ని సంధిస్తుంటే...

ఎప్పుడు వచ్చాడో తెలీదు. అల్లంత దూరంలో నిలబడి వున్న మరొక శత్రుసైనికుడి చేతుల్లోని గన్ వికృతంగా బుల్లెట్ల వర్షం కురిపిస్తోంది.

బోస్ కుడి చేయి తుపాకీ ట్రిగ్గర్ వైపైనా చేరనేలేదు. గుండెని తూట్లు తూట్లు చేశాయా బుల్లెట్స్.

కనుమూసి తెరిచేంతలో జరిగిపోయిన ఆ దారుణానికి కలత చెందుతూ బోస్‌కి అడ్డుగా పోబోయిన క్షతగాత్ర సైనికుడు సైతం ఆ తూటాలకి బలైపోయాడు.

''జయ జయ జయ
ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి..''

అనే గేయ పరిమళాలు భూ ఉపరితలాల నుండి అల్లనల్లన సాగుతూ..బోస్ చెవిని సోకి పరవశింపచేస్తున్న భ్రాంతి. తల్లి భారతికి మనసులోనే వందన మర్పిస్తూ... నేల కొరిగాడా వీర జవాన్.

అతడి తుది శ్వాస అనంత వాయువుల్లో కలసిపోయింది.

అసలు జరుగుతున్నదేమిటో అర్థంకాని అయోమయస్థితిలో... తుపాకీ కాల్పులు వినిపించి మరుక్షణం భారతీయ సైనిక పటాలమంతా బిలబిలమంటూ అటువైపు పరుగెత్తుకు రాసాగారు. ✪